క్లుప్తంగా

నియోజకవర్గ అధ్యక్షుడిగా అమరవరపు ప్రేమ్‌కుమార్



గరిడేపల్లి : తెలంగాణ మెడికల్ ప్రైవేట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ హుజూర్‌నగర్ నియోజకవర్గ అధ్యక్షుడిగా మండలంలోని కల్మలచెరువు గ్రామానికి చెందిన అమరవరపు ప్రేమ్‌కుమార్‌ను ఆ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తీగల శ్రీనివాసరావు నియమించారు. ఈ సందర్భంగా ప్రేమ్‌కుమార్ శనివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ప్రైవేట్ మెడికల్ ఎంప్లాయిస్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

కాంగ్రెస్ నాయకుల ప్రచారం

మునగాల : కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలతో రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని పార్టీ మండల నాయకులు కొలిశెట్టి బుచ్చిపాపయ్య, నల్లపాటి శ్రీనివాస్, ఉప్పుల జానకిరెడ్డి తెలిపారు. శనివారం వెంకట్రాంపురం, బరాఖత్‌గూడెంలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కాసర్ల కోటేశ్వరరావు, గరిణె శ్రీధర్, జిల్లేపల్లి వెంకటేశ్వర్లు, వేనేపల్లి వీరబాబు, కాలె సామియేలు, ఓరుగంటి రవి, షేక్ ఇమామ్‌అలీ, గుర్వయ్య, శ్రీను పాల్గొన్నారు.

‘మైహోం’ మైనింగ్‌లో పర్యావరణ పరిరక్షణ చర్యలు



మొక్కలు నాటుతున్న మైహోం ఉద్యోగులు

మేళ్లచెరువు : మండల కేంద్రం పరిధిలోని మైహోం సిమెంట్ పరిశ్రమలో గల మైనింగ్‌లో స్వచ్ఛత పక్షోత్సవాల్లో భాగంగా శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆ సంస్థ ప్రెసిడెంట్ ఎస్. శ్రీనివాసరావు మాట్లాడుతూ భారత గనుల శాఖ ఆదేశాల మేరకు మేళ్లచెరువు, చౌటపల్లి, వేపలమాధవరం గనుల్లో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మైన్స్ జీఎం శ్రీనివాసరావు, డీజీఎం అప్పలరాజు, సూర్యనారాయణరాజు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆర్‌ఓకు ఫిర్యాదు

హుజూర్‌నగర్ : ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘించి బెదిరింపులకు, ప్రలోభాలకు పాల్పడుతున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని న్యాయవాది కమతం నాగార్జున శనివారం హుజూర్‌నగర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి జగదీశ్వర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర అభ్యర్థులకు న్యాయ సలహాదారుడిగా పనిచేయడాన్ని జీర్ణించుకోలేక బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. ఈవిషయమై ఆర్‌ఓను సంప్రదించగా తమకు అందిన ఫిర్యాదును జిల్లా ఎన్నికల అధికారికి పంపినట్లు చెప్పారు.

గరుడ వాహనంపై ఊరేగిన నృసింహుడు



గరుడవాహనంపై స్వామివారి ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మీచెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని శనివారం అర్చకులు విశేషంగా నిర్వహించారు. స్వామిఅమ్మవార్లను నూతనపట్టు వస్త్రాలంకరణలో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, మధుపర్కపూజ, మాంగల్యధారణ, తలంబ్రాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు.అనంతరం స్వామి అమ్మవార్లను గరుడవాహనంపై ఆలయ తిరుమాఢ వీధుల్లో ఊరేగించారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని క్షేత్రంలోని శివాలయంలో శ్రీపార్వతీరామలింగేశ్వరస్వామిని భక్తులు దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓనవీన్, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటే వజ్రాయుధం



ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కోదాడఅర్బన్: ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటే వజ్రాయుధమని, ప్రతిఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోదాడ ఎంఈఓ ఎండీ సలీం షరీఫ్ అన్నారు. శనివారం కోదాడ పట్టణంలో ఎస్ఆర్ఎం, న్యూవిజన్ పాఠశాలల విద్యార్థులు ఓటు హక్కుపై నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. దేశం, రాష్ట్రం, మన ప్రాంతం అభివృద్ధి పథంలో ముందుకెళ్లాలంటే ప్రజలకు సుపరిపాలన అందించే మంచి నాయకుడిని ఎన్నుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రాజా, ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు గుణపాఠం తప్పదు

- హుజూర్‌నగర్ కాంగ్రెస్ అభ్యర్థి, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



హుజూర్‌నగర్ : కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మఠంపల్లి : తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా సీఎం కేసీఆర్ ప్రజానీకాన్ని మోసం చేశారని, ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు గుణపాఠం తప్పదని నల్గొండ ఎంపీ, హుజూర్‌నగర్ ఎమ్మెల్యే అభ్యర్థి ఎస్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం రాత్రి మఠంపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ రోడ్ షోలో ఆయన మాట్లాడారు. ప్రాజెక్టులు, పథకాల పేరుతో కేసీఆర్ లక్షల కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం చేశారని ఆరోపించారు. రైతుబంధు నిధులు విడుదల చేయాలని తాము డిమాండ్ చేస్తే కేసీఆర్ తమపై చేసిన అబద్ధపు ప్రచారానికి ఎన్నికల కమిషన్ ఇచ్చిన వివరణ చెంపపెట్టులాంటిదన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో హుజూర్‌నగర్‌లోని చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లు పూర్తిచేయలేని దద్దమ్మలు, టేలాండ్ రైతులకు కృష్ణానది నీటిని అందించేందుకు కోట్లాది రూపాయలతో నిర్మించిన ఎత్తిపోతల పథకాలను నడిపించలేని నాయకులు చేతగాని మాటలు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సాముల శివారెడ్డి, మాజీ సర్పంచ్‌లు స్రవంతికిషోర్‌రెడ్డి, కర్నె రమణావెంకటేశ్వర్లు, మాజీ ఉపసర్పంచ్ గాదె లూర్దుమారెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ దైదారాయల్, గాలి చిన్నపురెడ్డి, ఆంతోనిరెడ్డి, బాలశౌరెడ్డి, జార్జిరెడ్డి, ఎంపీటీసీ ప్రభుదాసు, జయభారత్‌రెడ్డి, మహేష్‌గౌడ్, నాగయ్య, వీరబాబు, వెంకటేశ్వర్లు, చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ నియోజకవర్గంగా అభివృద్ధి చేస్తా

హుజూర్‌నగర్ : కాంగ్రెస్ గెలవగానే హుజూర్‌నగర్‌ను ఒక ప్రముఖ పట్టణంగా, నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా అభివృద్ధి చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. శనివారం హుజూర్‌నగర్ మాజీ సర్పంచ్, బీఆర్‌ఎస్ నాయకుడు గొట్టె రామయ్య అతని అనుచరులు ఉత్తమ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో రాగానే డీడీలు కట్టిన యాదవులకు గొర్రెలు పంపిణీ చేస్తామని తెలిపారు. మేళ్లచెరువు – విష్ణుపురం రైల్వే లైన్‌లో ప్యాసింజర్ రైలు నడిపించేందుకు పార్లమెంట్‌లో ప్రపోజల్ పెట్టానని, కమిషనర్ ఆఫ్ రైల్వే సేఫ్టీని కూడా కలిసి విన్నవించినట్లు తెలిపారు. హుజూర్‌నగర్ పట్టణానికి కూడా రైల్వే లైన్ రాబోతుందని తెలిపారు. ఖమ్మం జిల్లా డోర్నకల్ నుంచి వయా నేలకొండపల్లి, కోదాడ, హుజూర్‌నగర్, వరదాపురం నుంచి మిర్యాలగూడెంకు నూతన రైల్వే లైన్‌కు డీపీఆర్ మంజూరు అయినట్లు చెప్పారు. హుజూర్‌నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీని అభివృద్ధి చేసి పీజీ సెంటర్ ఏర్పాటు చేస్తామని, పట్టణంలోని వంద పడకల హాస్పిటల్‌ను సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌గా మార్పిస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ నాయకులు యరగాని నాగన్న, అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్, తన్నీరు మల్లికార్జున్, గెల్లి రవి, ప్రభాకర్‌రెడ్డి, సుబ్బారావు, శ్రీనివాస్, ఎంపీపీ శ్రీను, గిరిబాబు, శ్రీనివాసరెడ్డి, గోపిరెడ్డి, మజీద్ పాల్గొన్నారు.

ఉత్తమ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరికలు

హుజూర్‌నగర్ : నేరేడుచర్ల మండలం కల్లూరుకు చెందిన బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు చలసాని శ్రీనివాసరావుతో పాటు పలు కుటుంబాల వారు శనివారం హుజూర్‌నగర్‌లోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిన్న వెంకటరెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



మఠంపల్లి : రోడ్‌షోలో మాట్లాడుతున్న ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



హుజూర్‌నగర్ : విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

కాంగ్రెస్ మేనిఫెస్టోతో అన్ని వర్గాలకు మేలు

- కోదాడ కాంగ్రెస్ అభ్యర్థి పద్మావతి



కోదాడరూరల్ : కూచిపూడిలో ప్రచారంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి పద్మావతిరెడ్డి

కోదాడరూరల్ : కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన మేనిఫెస్టోతో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని కోదాడ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎన్.పద్మావతిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కూచిపూడి, కూచిపూడితండా, సర్వేశరపురం, గుడిబండ గ్రామాల్లో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఒక్క రూపాయి కమీషన్ తీసుకోకుండా సంక్షేమ పథకాలను పేదలకు అందజేస్తామని తెలిపారు. దళితబంధు పథకం అమలులో లక్షల రూపాయల అవినీతి జరిగిందని ఆరోపించారు. అవినీతిమయమైన బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఆమెకు మహిళలు హారతి ఇచ్చి స్వాగతం పలికారు. కార్యక్రమాల్లో జెడ్పీటీసీ మందలపు కృష్ణకుమారిశేషు, మండల పార్టీ అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి, వైస్ ఎంపీపీ మల్లెల రాణి, రేవూరి వెంకటాచారి, తొండపు సతీష్, విజయ్‌భాస్కర్, రఫీ, నాగరాజు, సైదులు, రాజారావు, హాజీ తదితరులు ఉన్నారు.

పార్టీలో చేరిన వారికి గుర్తింపు

కోదాడరూరల్ : మండలంలోని తొగర్రాయికి చెందిన 100 మంది బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ అభ్యర్థి పద్మావతిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి తగిన గురింపునిస్తామని అన్నారు. పార్టీలో చేరిన వారిలో 9వ వార్డు సభ్యురాలు ఎలమర్తి కనకరత్నం, ఆనందం, దుర్గయ్య, బాబు, రమేష్‌తో పాటు వారి అనుచరులు ఉన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ లిక్కి గుర్వమ్మవెంకటయ్య, అమరనేని వెంకటేశ్వరరావు, సులోచనరావు తదితరులు ఉన్నారు.

కోదాడలో మట్టి మాఫియా రాజ్యమేలుతోంది

కోదాడ : కోదాడలో మట్టి మాఫియా రాజ్యమేలుతుండటంతో గత సంవత్సర కాలంగా నిర్మాణ పనులు నిలిచిపోయి అడ్డా కూలీలు, సుతారీ మేస్త్రీలు ఇబ్బందులు పడుతున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మట్టి సమస్య లేకుండా చూస్తానని కాంగ్రెస్ అభ్యర్థి నలమాద పద్మావతిరెడ్డి అన్నారు. శనివారం ఉదయం కోదాడ బస్టాండ్ సెంటర్‌లో అడ్డా కూలీలతో ఆమె సమావేశమై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తుందని, దీంతో మహిళా కూలీలకు రోజుకు వంద రూపాయల ఖర్చు తగ్గుతుందన్నారు. అంతేకాకుండా కాంగ్రెస్ ప్రభుత్వంలో అమలయ్యే ఆరు గ్యారంటీ పథకాలతో ప్రతి పేద కుటుంబానికి నెలకు రూ. 10 వేల లబ్ధి కలగబోతున్నదన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, వంగవేటి రామారావు, చింతలపాటి శ్రీనివాసరావు, గంధం యాదగిరి, కందుల కోటేశ్వరరావు, బాగ్దాద్, వెంకటేశ్వర్లు, జబ్బార్, బాషమియా, షమ్మి, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను ఆర్టీసీ కార్మికులు ఆదరించాలి

తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలకంగా వ్యవహరించిన ఆర్టీసీ కార్మికుల విషయంలో గడిచిన 9 సంవత్సరాలుగా కేసీఆర్ ప్రభుత్వం అణిచివేత దోరణి అవలంబించిందని, ఇది పోవాలంటే కార్మికులు కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని కాంగ్రెస్ అభ్యర్థి నలమాద పద్మావతిరెడ్డి కోరారు. శనివారం తెల్లవారుజామున కోదాడ ఆర్టీసీ డిపో వద్ద డ్యూటీకి వెళ్తున్న ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, కార్మికులతో ఆమె మాట్లాడారు.

బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రం అప్పులపాలు

మోతె : బీఆర్‌ఎస్ పార్టీ పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని కోదాడ కాంగ్రెస్ అభ్యర్థి పద్మావతి ఆరోపించారు. మండలంలోని అన్నారిగూడెం, కరక్కాయలగూడెం, లాల్‌తండా, రావికుంటతండా, రాందాస్‌తండా, రాంపురంతండా, అప్పన్నగూడెంతో పాటు పలు గ్రామాల బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలు సుమారుగా 600 కుటుంబాలు బోడబండ్లగూడెంలోని మాజీ ఎమ్మెల్యే చందర్‌రావు తోటలో శనివారం పద్మావతి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ముప్పాని ఆశ, జెడ్పీటీసీ పందిళ్లపల్లి పుల్లారావు, పార్టీ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ మైనంపాటి గుర్వారెడ్డి, కిసాన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ ముదిరెడ్డి మధుసుదన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ మాత్యనాయక్, ఉర్లుగొండ సర్పంచ్ మామిడి అనిత వెంకటేశ్వర్లు, చెరుకుపల్లి యల్లయ్య, సామ చిన్నవెంకటరెడ్డి పాల్గొన్నారు.



మోతె : కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న పార్టీ అభ్యర్థి పద్మావతి, మాజీ ఎమ్మెల్యే చందర్‌రావు



కోదాడ : బస్టాండ్ సెంటర్‌లో అడ్డా కూలీలతో మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి పద్మావతి

తెలంగాణ ప్రజలు బీజేపీకి పట్టం కట్టాలి

- కేంద్ర ఐటీ, స్కిల్ డెవలప్‌మెంట్ శాఖ సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్



విలేకరులతో మాట్లాడుతున్న రాజీవ్ చంద్రశేఖర్

హుజూర్‌నగర్ : తెలంగాణలో బీజేపీని గెలిపించాలని కేంద్ర ఐటీ, స్కిల్ డెవలప్‌మెంట్ శాఖ సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ అన్నారు. శనివారం హుజూర్‌నగర్‌లోని బీజేపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బడుగు బలహీన వర్గాలకు ప్రాధాన్యం కల్పిస్తూ బీసీని ముఖ్యమంత్రిని చేస్తామని ప్రకటించిన బీజేపీకి ప్రజలు పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ అభ్యర్థి చల్లా శ్రీలత, జిల్లా అధ్యక్షుడు బొబ్బా భాగ్యరెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు అంబళ్ల నరేష్, పట్టణ అధ్యక్షుడు రవి, రామరాజు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పార్టీ గెలుపునకు కృషి చేయాలి

- హుజూర్‌నగర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి సైదిరెడ్డి

మఠంపల్లి : అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించడానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని బీఆర్‌ఎస్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి కోరారు. శనివారం మండలంలోని బక్కమంతులగూడెం, చౌటపల్లి, కొత్తతండా, దొనబండతండా, జామ్లాతండా, భీల్యానాయక్‌తండా, వరదాపురం, తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఇరుగు పిచ్చయ్య, ఎంపీపీ పార్వతి, జెడ్పీటీసీ జగన్‌నాయక్, మాజీ ఎంపీపీ కొండా నాయక్, జిన్నారెడ్డి శ్రీనివాసరెడ్డి, రమణానాయక్, నవీన్‌నాయక్, కోటానాయక్, బీత వెంకటరెడ్డి, కృష్ణవేణి, అనిత, తదితరులు ఉన్నారు.

కమ్యూనిస్టులను అసెంబ్లీకి పంపించాలి

నేరేడుచర్ల : ప్రజా క్షేత్రంలో ప్రజల పక్షాన పోరాడే కమ్యూనిస్టులను అసెంబ్లీకి పంపించాలని హుజూర్‌నగర్ సీపీఎం అభ్యర్థి మల్లు లక్ష్మి ఓటర్లను కోరారు. శనివారం నేరేడుచర్ల మండలంలోని పెంచికల్‌దిన్న, కల్లూరు, ముకుందాపురం, మేడారం, బక్కయ్యగూడెం, పత్తేపురం, జానలదిన్న గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పారేపల్లి శేఖర్‌రావు, నాయకులు యాదగిరిరావు, గోపి, నగేష్, అనంత్‌ప్రకాశ్, శ్రీధర్, నాగేశ్వర్‌రావు, వరలక్ష్మి, ఆదిలక్ష్మి, కృష్ణవేణి, నాగసైదులు, రామ్మూర్తి, రాణమ్మ, బాబురావు, ధనుంజయ తదితరులు ఉన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



హుజూర్‌నగర్ : వివిధ వేషధారణలో విద్యార్థులు

మఠంపల్లి : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయుల వేషధారణలో తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన వారికి ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎండీఆర్ స్కూల్‌లో..

హుజూర్‌నగర్ : పట్టణంలోని ఎండీఆర్ హైస్కూల్‌లో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు దేవతలు, నాయకులు, అధికారులు, ఉపాధ్యాయుల వేషధారణలో అలరించారు. కార్యక్రమంలో చైర్మన్ మేరెడ్డి దామోదర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.



మఠంపల్లి : సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో..

బీఎస్పీతోనే బహుజనులకు రాజ్యాధికారం

మోతె : బీఎస్పీతోనే బహుజనులకు రాజ్యాధికారం వస్తుందని కోదాడ నియోజకవర్గ బీఎస్పీ అభ్యర్థి పిల్లుట్ల శ్రీనివాస్ అన్నారు. శనివారం మోతె మండలంలోని నామవరం గ్రామంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. శాసనసభ ఎన్నికల్లో బీఎస్పీకి ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు గోపి, వీరస్వామి, రాము పాల్గొన్నారు.

వైభవంగా పంబా ఆరట్టు మహోత్సవం



పూజలు చేస్తున్న మాలధారులు, భక్తులు

గరిడేపల్లి : మండల కేంద్రంలోని శ్రీ ధర్మశాస్త అయ్యప్పస్వామి ఆలయంలో శనివారం పంబా ఆరట్టు మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మశ్రీ వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో హోమం, విఘ్నేశ్వర పూజ, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి పూజ, అయ్యప్పస్వామికి అభిషేకం నిర్వహించారు. అనంతరం అయ్యప్ప మాలధారులు, గ్రామస్తుల భజనల మధ్య గ్రామంలో మహా కలశం, ఉత్సవ విగ్రహం ఊరేగింపు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పూజారి కొంపెల్లి కృష్ణశాస్త్రి, సుదర్శనం, వరద రాజంచార్యులు, వెంకీశర్మ, ఆలయ కమిటీ అధ్యక్షుడు గురుస్వామి, వీరమళ్ల రమేష్, మండాది ఆంజనేయులుగౌడ్, మాజీ అధ్యక్షుడు గుంటూరు రాములు, బండా నర్సిరెడ్డి, మాలధారులు, భక్తులు పాల్గొన్నారు.

ధన రాజకీయాలను ప్రజలు తిప్పికొట్టాలి

మునగాల : బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విచ్చలవిడిగా డబ్బులు వెదజల్లి, ఆచరణ యోగ్యం కాని పథకాలను ప్రవేశపెడతామని ప్రజలను మభ్యపెడుతూ గ్రామాల్లో ముమ్మర ప్రచారం నిర్వహిస్తున్నారని, ప్రజలు ధన రాజకీయాలని తిప్పికొట్టాలని కోదాడ సీపీఎం పార్టీ అభ్యర్థి మట్టిపల్లి సైదులు అన్నారు. శనివారం మండలంలోని మాధవరం, నేలమర్రి, వెంకట్రాంపురం, విజయరాఘవపురం, నరసింహులగూడెం, జగన్నాథపురం, కలకోవ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర నాయకులు కోట రమేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, బుర్రి శ్రీరాములు, నెమ్మాది వెంకటేశ్వర్లు, జిల్లా కమిటీ సభ్యులు దేవరం వెంకటరెడ్డి, మండల కమిటీ కార్యదర్శి చందా చంద్రయ్య, మండల కమిటీ సభ్యులు జూలకంటి విజయలక్ష్మి, ఆరె.రామకృష్ణారెడ్డి, బచ్చలకూరి స్వరాజ్యం, సుందరయ్య, శాఖ కార్యదర్శి జీడయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు కృషిచేస్తాం



ఉత్తమ్‌తో పిట్టా రాంరెడ్డి, నాయకులు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్, కోదాడలలో కాంగ్రెస్ అభ్యర్థులు ఉత్తమ్, పద్మావతి గెలుపునకు కృషి చేస్తామని వైఎస్సార్ తెలంగాణ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పిట్టా రాంరెడ్డి అన్నారు. శనివారం హుజూర్‌నగర్‌లోని ఎంపీ క్యాంప్ కార్యాలయంలో ఎంపీ ఉత్తమ్‌ను కలిసి తమ మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెండు నియోజకవర్గాలలో వైఎస్సార్ తెలంగాణ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ప్రచారంలో పాల్గొంటారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు

కోదాడఅర్బన్ : కోదాడ పట్టణానికి చెందిన దేవబత్తిని సురేష్ ఆయన అనుచరులు శనివారం బీజేపీలో చేరారు. వారికి బీజేపీ పట్టణ అధ్యక్షుడు సాతులూరి హనుమంతరావు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కిరాజు యశ్వంత్, ఓబీసీ మోర్చా జిల్లా అధికార ప్రతినిధి బొలిశెట్టి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

నల్లబెల్లం తరలిస్తున్న లారీ పట్టివేత

హుజూర్‌నగర్: నల్లబెల్లం తరలిస్తున్న లారీని శనివారం ఎక్సైజ్ అధికారులు, పోలీసులు సంయుక్తంగా మఠంపల్లి మండలంలోని మట్టపల్లి చెక్‌పోస్టు వద్ద పట్టుకున్నారు. ఎక్సైజ్ సీఐ నాగార్జునరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ ఎక్సైజ్ అధికారులు పోలీసులు మఠంపల్లి మండలంలోని మట్టపల్లి చెక్‌పోస్టు తనిఖీలు చేస్తుండగా.. ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు నుంచి తెలంగాణలోని వరంగల్‌కు నల్లబెల్లం తరలిస్తున్న లారీని పట్టుకున్నారు. లారీతో పాటు అందులో ఉన్న 30 క్వింటాళ్ల నల్లబెల్లం, 50 కేజీల పటికను సీజ్ చేశారు. లారీ ఓనర్ కం డ్రైవర్ గంజి కాలేబ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో మఠంపల్లి ఎస్ఐ బాలకృష్ణ, చెక్‌పోస్టు సిబ్బంది జయరాజ్‌తో పాటు ఎక్సైజ్ ఎస్ఐలు వెంకన్న, దివ్య, జగన్మోహన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ ప్రకాష్

గరిడేపల్లి : ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని డీఎస్పీ ప్రకాష్ అన్నారు. ఎన్నికల నేపథ్యంలో శనివారం రాత్రి మండలంలోని కల్మలచెరువు గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించి మాట్లాడారు. సమస్యాత్మక గ్రామాల్లో గొడవలు జరగకుండా పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో హుజూర్‌నగర్ సీఐ రామలింగారెడ్డి, ఎస్ఐ వెంకట్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య మనుగడకు ఓటు కీలకం

- సమాచార హక్కు పరిరక్షణ సమితి జాతీయ చైర్మన్ డాక్టర్ కేశవులు



ఓటరు చైతన్య అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ కేశవులు

కోదాడఅర్బన్ : ప్రజాస్వామ్య మనుగడకు ఓటు కీలకమని , ప్రతిఒక్కరూ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలని సమాచార హక్కు పరిరక్షణ సమితి జాతీయ చైర్మన్, ఎలక్షన్ వాచ్ కమిటీ జాతీయ చైర్మన్ డాక్టర్ బొమ్మరబోయిన కేశవులు కోరారు. శనివారం కోదాడలోని త్రివేణి డిగ్రీ కళాశాలలో ఓటర్ చైతన్య అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా సంక్షేమం, అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని మంచి నాయకుడికి ఓటు వేయాలని సూచించారు. ఒకవేళ అభ్యర్థులు ఎవరూ ఇష్టం లేని పక్షంలో నోటాకు వేయాలని కోరారు. ఎన్నికల నియామవళిని ఎవరైనా అతిక్రమిస్తే సంబంధిత ఆధారాలతో సి- విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేయాలని చెప్పారు. విద్యార్థులు తమతో పాటు కుటుంబసభ్యులు ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రోత్సహించాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయిచారు. ఈ సమావేశంలో తహసీల్దార్ సాయాగౌడ్, సీఐ టి.రాము, కళాశాల ప్రిన్సిపాల్ సిరికొండ శ్రీనివాస్, సమాచార హక్కు పరిరక్షణ సమితి కోదాడ కోఆర్డినేటర్ పూర్ణచందర్‌రావు, సైదిరెడ్డి, కట్టా శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఐ బలపరిచిన అభ్యర్థిని గెలిపించాలి

కోదాడఅర్బన్ : సీపీఐ బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థి పద్మావతిరెడ్డిని గెలిపించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. శనివారం కోదాడలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన కోదాడ నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రెండుసార్లు అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ప్రభుత్వం పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలను అన్ని రకాలుగా ఇబ్బందులు పెట్టిందని, గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో వైఫల్యం చెందిందని విమర్శించారు. గత పది ఏళ్లుగా ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేయడంలో పూర్తిగా నిర్లక్ష్యం వహించారని, దీంతో ఉన్నత చదువులు చదివిన నిరుద్యోగులు ఆయోమయంలో బతుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 23న కోదాడలో సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించే ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, నాయకులు మేకల శ్రీనివాసరావు, హనుమంతరావు, బద్దం కృష్ణారెడ్డి, షేక్ లతీఫ్, రాజు, వెంకటయ్య, కోటయ్య, కొండలు, అలివేలు, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

చిలుకూరు : మండలంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే వేడుకలను విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు అధ్యాపకులు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. కాగా, విద్యార్థులు చేసిన డ్యాన్స్‌లు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ మధిర ప్రీతిరెడ్డి, వైస్ చైర్మన్ గౌతమ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ నర్సిరెడ్డి, వివిధ విభాగాల హెచ్‌ఓడీలు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు వ్యతిరేకంగా పార్టీల మేనిఫెస్టోలు

కోదాడఅర్బన్ : నిరుద్యోగులకు, విద్యార్థులకు వ్యతిరేకంగా బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మేనిఫెస్టోలు ఉన్నాయని, దీంతో వారికి మరోసారి తీవ్ర అన్యాయం జరుగుతుందని కోదాడ స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థి పచ్చిపాల రామకృష్ణయాదవ్ అన్నారు. శనివారం కోదాడలోని కేఆర్‌ఆర్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులను కలిసి ఈ ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సతీష్, నవీన్, నరేష్, నాగరాజు, ఎల్లయ్య, లక్ష్మీనారాయణ, బాలాజీ, వెంకన్న, శివ, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.